

సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెంలో రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

## ధాన్యానికి నిప్పు పెట్టి రైతుల ఆందోళన

అర్వపల్లి, మే 9 : కొనుగోళ్లను వేగవంతం చేయడం లేదని నిరసిస్తూ రైతులు ధాన్యానికి నిప్పు పెట్టారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెంలో శుక్రవారం 365వ నంబర్ జాతీయ రహదారిపై వడ్లకు నిప్పు పెట్టి ఆందోళనకు దిగారు. ప్రతి సెంటర్‌కు లారీలను పంపించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని, మిల్లర్లు రైతుల దగ్గర ఒక లారీకి ఐదు క్వింటాళ్లు కట్ చేస్తున్నారని, వారి పర్మిషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కిరణ్ మాట్లాడుతూ.. ఐకేపీ సెంటర్లు ప్రారంభమై 45 రోజులు గడుస్తున్నా వడ్ల కొనుగోలు వేగవంతం కావడం లేదని ఆరోపించారు. దాంతో జాజిరెడ్డిగూడెం ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

### • కాంటా పెడ్తలేరని ధాన్యానికి నిప్పు



కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పెడ్తలేరని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు ధాన్యానికి నిప్పు పెట్టారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో శుక్రవారం చోటుచేసుకున్నది. తొర్రూరు మండలం హరిపిరాల, కర్కాల రైతులు రెండు ట్రాక్టర్లలో ధాన్యంతో తొర్రూరులోని గాంధీ చౌరస్తాకు చేరుకుని రాస్తారోకో నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధాన్యాన్ని తగులబెట్టి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వారిని కలిసి సంఘీభావం తెలిపారు. – తొర్రూరు

### • గన్నీ సంచులు ఇస్తలేరని రైతుల ఆందోళన



గన్నీ సంచులు సకాలంలో అందించకపోగా, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో రైతులు ఆందోళనకు దిగారు. స్థానిక ఫిరంగిగడ్డ వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తమపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎస్సై రాజు రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. – వర్ధన్నపేట

# సాములోరు దయతలిచారు!

- బాసరలో బీజాక్షరాలు రాయరట!
- గ్రామ హారతి కమిటీ ఆధ్వర్యంలో గోదావరి హారతి కొనసాగుతదట!
- ప్రభుత్వం ఆదేశిస్తేనే నిలిపివేస్తారట!
- విలేకరుల సమావేశంలో సెలవిచ్చిన సాములోరు విద్యానంద
- హారతి ఇవ్వడానికి ఆయనెవరు?
- ఘాట్ కబ్జా పెట్టి షెడ్లు కట్టి వ్యాపారం చేస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవట్లేదు?
- ఇద్దరు పిల్లలపై ఇంత దారుణం జరిగినా పోలీసులు ఎందుకు పట్టించుకుంటలేరో చెప్పాల్సిందే?
- నిలదీస్తున్న ఆధ్యాత్మికవేత్తలు, బాసరవాసులు, స్థానిక నేతలు

బాసర, మే 9 : ఆంధ్రా సాములోరు ఎట్టకేలకు కరుణించారు. పామర జనంపై దయ తలచి నోరు విప్పారు. వేద పాఠశాల కమిటీ సభ్యులతో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశం పెట్టారు. చివరికి వారు చెప్పింది ఎట్లున్నదంటే 'ఉల్టా చోర్ కొత్వాల్‌కో డాంటే' అన్నట్టు ఉన్నది.

బాసరలోని ప్రైవేట్ వేద పాఠశాలలో ఇద్దరు విద్యార్థులపై అమానవీయ దాడి, ఓ విద్యార్థి మృతికి కారణం ఆంధ్రా స్వామీజీయేనని స్వయంగా పిల్లల తల్లిదండ్రులే ఆరోపిస్తుంటే ఆయన మాత్రం ఈ ఘటనల్లో నిందితులను పట్టుకొని చట్టపరంగా శిక్షించాలని కోరుతున్నామని చెప్పారు తప్ప అసలు ఆ దారుణాలకు కారణాలను మాత్రం చెప్పలేదు. వేద పాఠశాలలో విద్యార్థుల రక్షణ, బాధ్యత తనది కాదా? ఘటన జరిగిన వెంటనే పోలీసులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదు? ఇలాంటి వివరణలేవీ ఇవ్వలేదు. ఆశ్రమం పాత్ర.. తన పాత్ర.. తన బాధ్యతను వివరించలేదు. ఏకంగా గోదావరి ఘాట్ కబ్జా పైనా మాట్లాడలేదు.

**బీజాక్షరాలు రాయడం ఆపుతారట!**

ఇంకా ఆంధ్రా సాములోరు తెలంగాణ ప్రజానీకానికి దయతలచి ఇచ్చిన గొప్ప వరం ఏమిటంటే నాలుకపై బీజాక్షరాలు రాయడం ఆపుతారట! అసలు బీజాక్షరం రాయడం అనేది ఆశాస్త్రీయం కాగా, దాన్ని ఆపేయడాన్ని తెలంగాణ సమాజానికి చేస్తున్న గొప్ప మేలు కింద ఆయన చెప్పుకోవడం విడ్డూరంగా ఉన్నది. ఇద్దరు పిల్లలపై దాడి, ఒక పిల్లవాడి మరణానికి కారణం అని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి మళ్లీ దేవ పాఠశాలను ప్రారంభిస్తానని ఎలా చెప్తారు? దర్యాప్తు పూర్తి కాకుండానే ఏ ధైర్యంతో చెప్తున్నారు? వేద పాఠశాల ఘటనపై విచారణ, దర్యాప్తు పూర్తి కాకుండానే పాఠశాలను ప్రారంభిస్తామని స్వామీజీ చెప్తుంటే జిల్లా ఉన్నతాధికారులు ఏం చేస్తున్నట్టు? గ్రామ కమిటీ, వేద పాఠశాల కమిటీ అని పేర్లు పెట్టుకొని బహిరంగంగా విలేకరుల సమావేశం పెట్టి తాను ఏం చేస్తానో.. ఏం చేయనో తనకు తానే స్వామీజీ ప్రకటించుకుంటుంటే ఇక్కడి అధికారులు, ఇరిగేషన్, రెవెన్యూ, దేవాదాయ శాఖల చేతులు పడిపోయాయా? అని స్థానిక నేతలు ప్రశ్నిస్తున్నారు.



నిర్మల్ జిల్లా బాసరలో విలేకరులతో మాట్లాడుతున్న స్వామి వేద విద్యానంద గిరి

**ప్రభుత్వం ఆదేశిస్తేనే ఆపేస్తరట!**

త్వరలోనే వేద పాఠశాలను మళ్లీ ప్రారంభిస్తామని, గోదావరి నదికి హారతి కార్యక్రమాన్ని గ్రామ హారతి కమిటీ నిత్యం కొనసాగిస్తదని, దీనికి వేద పాఠశాల కమిటీ నుంచి పూర్తి మద్దతు ఉంటుందని సదరు ఆంధ్రా సాములోరు చెప్పుకొచ్చారు. ప్రభుత్వం ఆదేశిస్తే మాత్రమే నిత్యహారతి కార్యక్రమాన్ని నిలిపివేస్తామని సెలవిచ్చారు. అసలు గోదావరి హారతికి, స్వామీజీకి ఏం సంబంధం? గోదావరి నది తెలంగాణది.. నది వద్ద ఘాట్లు ప్రభుత్వం, ఇరిగేషన్, దేవాదాయ శాఖలకు చెందినవి. అక్కడ 'నేనే హారతి ఇస్తా' అని చెప్పడానికి స్వామీజీ ఎవరు? కమిటీ ఎవరు? మద్దతు ఇవ్వడానికి వేద పాఠశాల ఎవరు?

పిల్లవాడి మృతికి గల కారణాలను అన్వేషించాల్సిన పోలీసులు ఏం చేస్తున్నట్టు? గోదావరి ఘాట్‌ను ఆంధ్రా సాములోరు పెట్టిన కబ్జాను తొలగించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు ఏం చేస్తున్నట్టు? ఒక ప్రైవేట్ వ్యక్తి ఘాట్లలో గోదావరికి నిత్య హారతి, బీజాక్షరాలు రాయడం విషయాల్లో దేవాదాయ శాఖ ఏం చేస్తున్నదని పలువురు ఆధ్యాత్మిక వేత్తలు ప్రశ్నిస్తున్నారు. వీటన్నింటినీ పరిశీలించాల్సిన ఉన్నతాధికారి ఏం చేస్తున్నరని నిలదీస్తుండ్రు.

**సర్కారుకు ఎందుకింత ఔదార్యం?**

ఓవైపు రాష్ట్రంలో చెరువులను పరిరక్షిస్తం.. అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని చెప్తూ హైడ్రా వంటి సంస్థను తెచ్చి కనికరం లేకుండా నిరుపేదల ఇండ్లను కూల్చివేస్తున్న ప్రభుత్వం, దర్జాగా గోదావరి ఘాట్‌ను కబ్జా పెట్టి షెడ్లు కట్టి వ్యాపారం చేస్తున్న ఆంధ్రా సాములోరిపై ఎందుకు ఇంత ఔదార్యం చూపిస్తున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత జరుగుతున్నా స్థానిక అధికార యంత్రాంగం ఎందుకు నోరు విప్పడం లేదన్న ప్రశ్నలు వస్తున్నాయి. దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతి మాత ఆలయానికి అప్రతిష్ఠ వచ్చి పడుతున్నదని తెలిసినా స్థానిక బీజేపీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడం వెనుక రహస్యం, మతలబు ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇక గోదావరి హారతి నిర్వహణపై ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటది? ఎప్పుడు ఆదేశాలు జారీ చేస్తది? అన్న చర్చ నడుస్తున్నది.

# మూడేండ్ల క్రితం నాటు.. ముప్పై ఏండ్ల వరకు ఫలం

- బీఆర్‌ఎస్ సర్కార్ ప్రోత్సాహంతో నాగాపూర్‌లో ఆయిల్‌పామ్ సాగు
- నేడు కోతకు రావడంతో ఆనందం వ్యక్తంచేస్తున్న రైతు దంపతులు
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చొరవకు కృతజ్ఞతలు

చెన్నూర్ రూరల్, మే 9 : మూడేండ్ల క్రితం నాటుకున్న మొక్కలు ఇప్పుడు కోతకు రావడంతో ముప్పై ఏండ్ల వరకు ఫలం ఇవ్వనున్నది. అప్పట్లో బీఆర్‌ఎస్ సర్కార్ ప్రోత్సాహం, అప్పటి స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్ చొరవతో నాటిన ఆయిల్‌పామ్ మొక్కలు ఇప్పుడు కోతకు రావడంతో ఆ రైతు ఆనందంలో మునిగిపోయాడు. వివరాలు ఇలా.. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం నాగాపూర్‌కు చెందిన రైతు అన్నల తిరుపతి–మానస దంపతులు తమకున్న ఆరెకరాల్లో మూడేండ్ల క్రితం ఆయిల్‌పామ్ తోటను సాగు చేశారు. ఇప్పుడు పంట చేతికి రాగా శుక్రవారం కుటుంబ సభ్యులు, స్థానిక రైతులు, మ్యాట్రిక్స్ కంపెనీ ప్రతినిధులు సమక్షంలో పండుగ వాతావరణంలో కోత ప్రారంభించారు. మూడేండ్ల క్రితం బీఆర్‌ఎస్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే, విప్ బాల్క సుమన్ ప్రోత్సాహంతో పంట సాగు చేయగా, ప్రస్తుతం గెలలు వచ్చాయని, పంట వేసిన మూడేండ్ల నుంచి 30 ఏండ్ల వరకు దిగుబడులు సాధించవచ్చని రైతు తిరుపతి ఆనందంతో వ్యక్తంచేశారు. ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించి ప్రోత్సహించినందుకుగాను బాల్క సుమన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మ్యాట్రిక్స్ కంపెనీ సీఈవో ఉదయ్ కుమార్, కంపెనీ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పామాయిల్ పంటను చూపిస్తున్న రైతులు, చిత్రంలో మ్యాట్రిక్స్ కంపెనీ ప్రతినిధులు

**30 ఏండ్ల దాకా ఆదాయం : మ్యాట్రిక్స్ సీఈవో**

పామాయిల్ సాగుతో మూడేండ్ల నుంచి 30 ఏండ్ల వరకు దిగుబడులు సాధించి ఆదాయం పొందవచ్చని మ్యాట్రిక్స్ కంపెనీ సీఈవో ఉదయ్‌కుమార్ తెలిపారు. ఎకరంలో సుమారు 50 మొక్కలు నాటవచ్చని, మూడేండ్ల తర్వాత పంట చేతికొస్తుందని పేర్కొన్నారు. మూడేండ్ల తర్వాత ఏటా ఎకరంలో సుమారు 10 టన్నుల దిగుబడి (రూ.2 లక్షల ఆదాయం) వస్తుందని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ. 2000 ఉన్నట్టు తెలిపారు.

## 80కి పైగా ప్రిన్సిపల్ పోస్టులు భర్తీచేయాలి: టిగ్లా

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న 80కి పైగా ప్రిన్సిపల్ పోస్టులను పదోన్నతులతో తక్షణమే భర్తీ చేయాలని తెలంగాణ ఇంటర్మీడియట్ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ (టిగ్లా) ప్రభుత్వాన్ని కోరింది. డైరెక్టర్ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్ పోస్టు, 26 జిల్లాలకు జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టులను మంజూరుచేయాలని విజ్ఞప్తిచేసింది. శుక్రవారం టిగ్లా వ్యవస్థాపక అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణగౌడ్, అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్కే నయీం పాషా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నియమించిన అధికారులు కమిటీ చైర్మన్ నవీన్ మిట్టల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

## కంటెంట్ తొలగించాలని ఆదేశించడం కోర్టుల విధి కాదు : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : బహిరంగ చర్చలు, నిష్పాక్షికతలను పణంగా పెట్టి, ఎటువంటి కారణం లేకుండా, మీడియా రిపోర్టింగ్‌ను తొలగించాలని ఆదేశించడం కోర్టుల విధి కాదని సుప్రీంకోర్టు శుక్రవారం చెప్పింది. ఏఎన్ఐ వార్తా సంస్థకు అనుకూలంగా ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసింది. వికీమీడియా ఫౌండేషన్‌పై ఏఎన్ఐ దాఖలు చేసిన పరువు నష్టం దావా వివరాలను వికీపీడియా పేజ్‌లో పోస్ట్ చేశారు. ఈ పేజ్‌ను తొలగించాలని వికీమీడియా ఫౌండేషన్‌ను గతంలో హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

## సీఆర్‌పీఎఫ్‌లో బదిలీలు, శిక్షణా కోర్సులు వాయిదా

న్యూఢిల్లీ, మే 9:భారత్–పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో సీఆర్‌పీఎఫ్‌లో బదిలీలు, పోస్టింగ్ ఆర్డర్స్, సిబ్బంది శిక్షణా కోర్సులను వాయిదా వేస్తున్నట్టు అధికారులు శుక్రవారం ప్రకటించారు. సరిహద్దు ప్రాంతాల భద్రతను బలోపేతానికి జమ్ముకశ్మీర్‌కు 2,400 మందితో కూడిన సీఆర్‌పీఎఫ్ బలగాలను పంపినట్టు అధికారిక వర్గాలు తెలిపాయి. అత్యవసర భద్రతా పరిస్థితుల కారణంగా అధికారులు, ఇతర సిబ్బంది వారి వారి పోస్టింగ్ స్థానంలోనే ఉండాలని సీఆర్‌పీఎఫ్ ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

# దళితబంధు వస్తే ఇందిరమ్మ ఇల్లు కట్

- కాంగ్రెస్ సర్కారు కొత్త మెలిక
- పైలట్ గ్రామం ధర్మరాజుపల్లిలో దళితుల గోస
- గతంలో గ్రామ సభ జాబితాలో పేర్లు
- పాత నివాసాలు కూల్చి నిర్మాణ ఏర్పాట్లలో నిమగ్నం
- తీరా ఇండ్లు రాలేదని అధికారులు చెప్పడంతో లబోదిబో

హుజూరాబాద్, మే 9: ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో ప్రభుత్వం అనేక కొర్రీలు పెడుతున్నది. పేదల సొంతింటి కల నెరవేరుస్తామని, అర్హులందరికీ రూ.5 లక్షలు ఇస్తామని ఇన్నాళ్లు ఊరించి, ఇప్పుడు సవాలక్ష ఆంక్షలు విధిస్తున్నది. దళితబంధు వస్తే ఇందిరమ్మ ఇండ్లకు ఎగనామం పెడుతున్నది. ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం ధర్మరాజుపల్లిని పైలట్ ప్రాజెక్టు కింద అధికారులు ఎంపిక చేశారు. గ్రామసభ పెట్టి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని ప్రకటించారు. రేషన్‌కార్డు, రైతుభరోసా, రైతుబీమా, ఇందిరమ్మ ఇండ్లు తదితర ప్రభుత్వపథకాలకు అర్హులైన వారి జాబితాను గతంలో గ్రామసభ నిర్వహించి అధికారులు ప్రకటించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎంపిక చేసిన జాబితాలో దళితబంధు లబ్ధిదారులు కూడా ఉన్నారు. అయితే జాబితాలో తమ పేరు వచ్చిందని దళితులు ఆనందంలో మునిగిపోగా.. దళితబంధు తీసుకున్నోళ్లకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేదే లేదని కొర్రీలు పెట్టడంతో ఆందోళన చెందుతున్నారు.

**ఒక్కొక్కరిది ఒక్కోగాథ..**

గ్రామసభలో ప్రకటించిన జాబితాలో పేర్లు రావడంతో చాలామంది దళితులు ఇంటి నిర్మాణానికి సన్నద్ధమయ్యారు. పాత ఇండ్లు కూల్చి కొత్తవి నిర్మించుకునేందుకు సిద్ధమైన వాళ్లు కొందరు, నానాతంటాలు పడి ఇంటినిర్మాణానికి అవసరయ్యే ఇసుక, బండ తెప్పించుకున్న వాళ్లు మరికొందరు. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కరికి ఒక్కో దీనగాథ. మొదటగా ప్రకటించిన జాబితాలో ఇందిరమ్మ ఇల్లు వచ్చిందని ప్రకటించగా.. తర్వాత, ఏమైందో తెలియదు కానీ, దళితబంధు వచ్చిన వాళ్లకు ఇల్లు ఇవ్వడం లేదని అధికారులు పేర్కొనడంతో దళితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



ధర్మరాజుపల్లిలో నిరసన తెలుపుతున్న ఇందిరమ్మ ఇండ్ల బాధితులు

**పాత ఇల్లు కూల్చినంక ఇల్లు రాలేదన్నరు..**



ఈ చిత్రంలో బేస్మెంట్ వరకు పూర్తయిన ఇంటి ముందు ఉన్న ఇతని పేరు ఎలికటి రవి. ధర్మరాజుపల్లిలో గతంలో నిర్వహించిన గ్రామ సభలో ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు ఉండటంతో శిథిలమైన తన పాత ఇంటిని కూల్చివేశాడు. కొత్త ఇంటి నిర్మాణానికి అధికారులు ముగ్గు కూడా పోశారు. వారు ఇచ్చిన ప్లాను ప్రకారంగా ఇంటి నిర్మాణాన్ని మొదలు పెట్టాడు. బేస్మెంట్ వరకు పూర్తి చేశాడు. ఈ క్రమంలో గ్రామ కార్యదర్శి వచ్చి ఇల్లు నిర్మాణం ఆపాలని చెప్పడంతో రవి బిక్కమోహం వేశాడు. ఎందుకు మేడం? అని అడిగాడు. మీకు దళితబంధు స్కీం వచ్చినందున ఇందిరమ్మ ఇల్లు క్యాన్సిల్ అయిందని చెప్పడంతో అతను భోరున విలపించాడు. ఇలాంటి వారు గ్రామంలో 45 మంది ఉండడం గమనార్హం.

**కొత్తింటి కల నెరవేర్చాలి..**



గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్ల జాబితా ప్రకటించారు. అందులో నా పేరు రావడంతో సంతోషమేసింది. పాత రేకుల కింద చుట్టూ పరదాలతో తలదాచుకుంటున్న. మేము కొత్త ఇల్లు నిర్మించుకుంటున్నామని కలలు కన్నాం. ఇంటి నిర్మాణం కోసం ఇసుక, బండ తెచ్చుకున్నాం. పునాదులు తీద్దామని అనుకుంటుండగానే మీకు దళితబంధులో ట్రాక్టరు వచ్చిందని ఇల్లు కట్టుకోవద్దని అధికారులు చెప్పడంతో ఏమి చేయాలో తోచడంలేదు. అధికారులు దయతలచి కొత్తింటి కల నెరవేర్చాలి.

– పాముకుంట్ల పుష్ప, ధర్మరాజుపల్లి, మం: హుజూరాబాద్



అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండలం చంద్రుతండా పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గిరిజనులు

## 'ఇందిరమ్మ' కోసం ఉన్న ఇండ్లు కూల్చుకున్నం

- అర్హులకు ఇండ్లు ఇయ్యకపోతే ఇంకెవరికి ఇస్తరో చెప్పాలి
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రు తండాలో నిరుపేదల నిరసన

ఇల్లెందు, మే 9 : ఇందిరమ్మ ఇల్లు వస్తదని ఉన్న ఇల్లు కూల్చుకున్నామని, ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని పలువురు పేదలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం చంద్రు తండా పరిధిలోని రాజుతండా, చంద్రు తండా, సూర్యాతండా, గోప్యాతండాకు చెందిన గిరిజనులు శుక్రవారం చంద్రుతండా పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు మాట్లాడుతూ.. తమ తండాల్లో అర్హులైన వారికి ఇండ్లు కేటాయించకుండా.. అనర్హులకు, ఆర్థికంగా ఉన్న వారికి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఇందిరమ్మ కమిటీలు ఉన్నా నిరుపేదలకు న్యాయం జరగడం లేదని మండిపడ్డారు. ఇంటికి రూ.50 వేల చొప్పున కమిటీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. తొలిజాబితాలో రాజుతండాకు చెందిన జర్పుల రమేశ్–లలిత దంపతుల పేరుండటంతో ఇల్లు వస్తుందనే ఆశతో ఉన్న గుడిసెను తొలగించుకున్నారని, ఇప్పుడు ఇండ్ల జాబితాలో పేరు లేకపోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇలా ఎంతో మంది నిరుపేదలు ఇండ్లు కూల్చుకొని ఎదురుచూస్తున్నా అధికారులు, ప్రభుత్వం కనికరం చూపడం లేదని మండిపడ్డారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం మాచినేనిపేట పంచాయతీ కార్యాలయ గేటుకు తాళం వేసి ధర్నా చేస్తున్న గ్రామస్థులు

## అనర్హులకు ఇండ్లు ఎట్లిస్తరు?

- కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డ మాచినేనిపేట గ్రామస్థులు
- పంచాయతీ కార్యాలయ గేటుకు తాళం వేసి ఆందోళన

భద్రాద్రి కొత్తగూడెం, మే 9 (నమస్తే తెలంగాణ) : ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక జాబితాలో అనర్హుల పేర్లు ఎలా చేర్చుతారని ఆగ్రహం వ్య క్తంచేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం మాచినేనిపేట గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ కార్యాలయం గేటుకు తాళం వేసి బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ.. నిరుపేదలు, వితంతువులు, పూరి గుడిసెల్లో నివసిస్తున్న వారి పేర్లు మొదటి జాబితాలో వచ్చాయని, ఆ తర్వాత ఏమైందోగానీ ఆ పేర్లన్నీ మాయమయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. గల్లంతైన తమ పేర్ల గురించి అధికారులను నిలదీసినా సమాధానం కరువైందని వారు మండిపడ్డారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, సొంత పార్టీ కార్యకర్తలకే ఇండ్లు మంజూరు చేస్తూ.. అర్హులైన నిరుపేదలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. వెంటనే అర్హులైన అందరి పేర్లు ఇండ్ల జాబితాలో చేర్చాలని, లేదంటే మళ్లీ ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

## జిల్లా కేంద్రాల్లో విద్యుత్తు సామగ్రి స్టోర్స్

**2030కి విద్యుత్తు గరిష్ఠ డిమాండ్ 24,215 మెగావాట్లు**

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ) : విద్యుత్తు ఉపకరణాలు, సామగ్రిని అందుబాటులో ఉంచేందుకు ప్రతి జిల్లా కేంద్రంలోనూ విద్యుత్తు సామగ్రి స్టోర్స్‌ను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. 2023 వరకు ఐదేండ్ల కార్యాచరణ ప్రణాళికపై శుక్రవారం సచివాలయంలో భట్టి విక్రమార్క ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. విద్యుత్తు గరిష్ఠ డిమాండ్ 2030 నాటికి 24,215 మెగావాట్లకు చేరుతుందని అధికారులు వివరించారు. కొత్తగా 122 ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్లు, 752 33/11 కేవీ సబ్‌స్టేషన్లను నిర్మించనున్నట్టు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. రాష్ట్రంలో 23 సోలరైజ్డ్ మోడల్ గ్రామాలు, రెండు సోలరైజ్డ్ మండలాలుగా మార్చనున్నట్టు రెడ్‌కో వెల్లడించింది. సోలార్ విద్యుత్తు ప్రస్తుతం 7,913 మెగావాట్లు ఉండగా, 2030 నాటికి 19,874 మెగావాట్లు లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొంది.

## సర్కారు కాలేజీల్లో పేషియల్ రికగ్నిషన్

**రోజువారి హాజరు మానిటరింగ్**


హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని సర్కారు జూనియర్ కాలేజీల్లో పేషియల్ రికగ్నిషన్(ఎఫ్ఆర్ఎస్) హాజరును అమలుచేయనున్నారు. అంతేకాకుండా రోజువారి హాజరును సైతం మానిటరింగ్ చేస్తారు. విద్యార్థుల హాజరును ప్రతిరోజూ, ప్రతి నెలా తల్లిదండ్రులకు ఎస్ఎంఎస్ రూపంలో పంపిస్తారు. యోగా, స్పోర్ట్స్‌లకు ప్రాధాన్యం ఇస్తారు. ఇంటర్ విద్య అధికారులతో ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అకడమిక్ మాడ్యూల్‌తోపాటు విద్యార్థుల హాజరును సమర్థంగా అమలుచేయాలని సూచించారు. ఇంటర్ ఫలితాలపై సమీక్షించిన ఆయన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా చూడాలని ఆదేశించారు.

### • తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం ఉప్పరిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గుట్టబోరు, కొత్తూరులో తాగునీరందక స్థానికులు సతమతమవుతున్నారు. శుక్రవారం గుట్టబోరులో మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మూడు నెలలుగా తాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కేసీఆర్ సర్కార్ అమలు చేసిన మిషన్ భగీరథ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. – చర్ల

### • జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 10,954 జీపీవో పోస్టులను నేరుగా భర్తీ చేయాలని రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయం ఎదుట శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు జంగయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీపీవో పోస్టులను పాత వీఆర్వో, వీఆర్‌ఏలతో భర్తీ చేయడంతో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. 129 జీవో ప్రకారం ఆప్షన్లు ఇచ్చిన 6,120 పైచిలుకు పాత వీఆర్వో, వీఆర్‌ఏలకు పరీక్షలు నిర్వహించి విధుల్లోకి తీసుకోవాలని, మిగిలిన ఖాళీలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. –ఉస్మానియా యూనివర్సిటీ